మందు - అలమార్లో పుస్తకాల వెనుక నాకోసం తెచ్చి దాచిన సీసాలోని మందు ముక్కు మూసుకుని కళ్ళు తెరచి గటగటా త్రాగేశాను.

అంత మంచి మందిచ్చిన కథల డాక్టరుగారికి వెరీ మెనీ థాంక్స్ గాలిలో తేలిపోతున్నట్లుగా ఉంది మనసున మల్లెల మాల లూగెనే....

ఏవిటీ? ఏవిటా చిందులు? ఏమా చిరాకు -

అది నా మందు కాదా? నా కోసం మీరసలు మందు పత్రాలేదా? తెచ్చారునాన్నగారు గూట్లో పుస్తకాల వెనక పెద్ద సీసాడు మందు తెచ్చారు అన్నాడు రాముగాడు. ఆ వెధవే నండీ మంచి నీళ్ళ గ్లాసుతో గ్లాసుడు మందు త్రాగమ్మా జ్వరం పోతుంది అని తెచ్చి ఇచ్చాడు. మరి ఇంతకీ - ఈ సీసా యిది నా కోసం తెచ్చిన మందుకాదా? లావుపాటి పుస్తకాల వెనక దీన్ని ఎవరు పెట్టారు చెప్మా?

# తారుమారు బలే పెళ్ళి

నేను కోనసీమ పిల్లని. మీ పెత్తల్లిది కోనసీమ. మా అమ్మ సరేసరి - కోనసీమ వారి ఆడపడుచు. ఎందుకలా నవ్వుతారు? ఏమనుకుంటున్నారో "కోనసీమ" అంటే "కోటి రత్నాల సీమ"

మిమ్మల్నేమో పెద్దమనిషి అనుకొని మావేలువిడచిన అన్నయ్య కోనసీమ పెళ్ళికి పిలిస్తే ఆడపెళ్ళివారి తరపున వచ్చి తగుదునమ్మా అని మొగపెళ్ళి వారిని "మట్టిమనుష్యులు" అన్నారట మీరు. మావాళ్ళంటే మీ కంత వేళాకోళాలుటండీ మరీనూ; మగపెళ్ళి వారికోసం చేయించి తెచ్చిన "పూతరేకులు" బస్సులో పిల్లలకు పైగా పంచిపెట్టించేసి, మినపసున్ని ఉండలు, లడ్లు పెట్టిన డబ్బాలు ఎక్కడున్నాయో పిల్లలకు చూపించేశారుట;

సరదాకైనా ఓ హద్దూ పద్దూ ఉండాలి.

మా మార్కేండేయులు అన్నయ్యని "పాప్మాగుడు" - "మిస్టర్ మార్క్" అని ఎగతాళి పట్టించారట కదా;

కాగితాల మీద ఏదో బరుకుతారుగదా అని మిమ్మల్ని మావాళ్ళు "జెంటిల్మాను"గా చూస్తోంటే వాళ్ళని మట్టి మనుష్యులు అనడం ఏం బావుందీ?

మీ చెల్లెలు గీచిన గీటుదాటడు మా అన్నయ్య. చదువుకున్న దానిననీ, అందమైన దానిననీ, అప్ టు డేటు గరల్ననీ "మీరజారగలడా నా యానతి" అన్నట్లు నా మొగుడు నా మాట జవదాటడనీ దాని కెంత ధీమా? గర్వం? మా అన్నయ్యకు ముక్కుకు తాడుకట్టి ఆడించే మీ

చెల్లెలు పాపకు నాబోటిదాన్ని కళ్ళకు కనిపిస్తానా? మిమ్మల్ని తలుచుకుని గర్వపడదామంటే మీకొక డొక్కుకారు కూడా లేదాయె.... మనింటికొచ్చే బాపతంతా రిక్షాలమీద వస్తారు. రిక్షాలమీద, ఎద్దుబళ్ళమీద వచ్చే చుట్టాలంటే మిస్టర్‌మార్క్‌గారి పెళ్ళానికి చెడ్డ చిరాకు. కాస్త నల్లగా చామన చాయగా వున్నవారంటే వొళ్ళుమంట. మా మేనత్త కూతురికి, మరి శ్రీ కృష్ణుడు అంత జెట్ బ్లాక్‌గా వున్నప్పటికీ ఆ విలేజి గరల్స్ అతని చుట్టూ వేల సంఖ్యలో తిరిగేవారట; కాస్త పెళ్ళికావలసిన పిల్ల కొంచెం నల్లగా వుంటే నీగ్రోను చూసినట్లుగా కంపరమెత్తిపోయే మేనత్తలు. ఆడపడుచులూ వున్నారు. ఈ రోజుల్లో మగాళ్ళయినా ఆడవాళ్ళయినా ఎంత సింపుల్‌గా వుంటే అంత బాగుంటారు గొప్పగా, డాబుగా, దర్జాగా వుండడానికి ఎంత ప్రయత్నిస్తే మనుష్యులు అంత అసహ్యంగా వుంటారు. డాబుగాళ్లు డాబుగాళ్ళతో తప్ప మాట్లాడరు. అందగత్తెలు అందగత్తెలనే పలకరిస్తారు. ఈ విధంగా చూస్తే నాబోటి నల్లని దానిని చెల్లదని ఎవరూ పలకరించకపోవచ్చు. ఎర్రగా బుర్రగా డాబుగా దర్జాగా వుండకపోతే పెళ్ళిళ్ళలో మర్యాదలు ఎక్కువ జరగవు. చీరలూ, నగలూ, పిల్లలూ, ఆ తరువాత రోగులూ, ఆపరేషన్లూ-ఆపరేషన్ల గురించీ రోగాల గురించీ ఎంత చెప్పుకుంటే అంత సుకుమారి సుశరీరి అని భావన.

చీరల్ను చూసి పీటలు వేస్తారు. మీ రంటె వేళాకోళాలు చేస్తూ దులుపుకుని తిరుగుతారు కానీ ఒక డొక్కుకారు కూడా లేనివాడి భార్యను పిలిచి పీటవేసి కూర్చోపెట్టి ఎవరు గౌరవిస్తారు?

కోనసీమ వారితో కొంచెం జాగ్రత్తగా వుండండే అని చెబుతూ నేనే పప్పులో అడుగేశాను.

పాలీ అరిగిపోయేలాగ కాగితాలమీద బరుకుతారు కదూ -అందుకని మీకంతా రెస్పెక్టు ఇస్తారని మీరనుకుంటున్నట్లున్నారు.

మా వదిన, సుకుమారీ వదినా మంగళకర వదినా... మా అన్నయ్య పిల్లల్నెత్తు కుంటాడు, పిల్లల్నాడిస్తాడు, వాడి కదో సరదా–మీరు మా అన్నయ్యకు డైరక్టుగా అటాకిచ్చే సరికి మిమ్మల్నే మనలేక ఆ అగౌరవం అంతా నాకు చూపిస్తున్నారు.

పంట కాలువలు, కొబ్బరి చెట్లు - పనస కాయలతో పిల్లతల్లిలా అడుగడుక్కీ నేత్ర పర్వంగా దర్శనమిచ్చే పనస చెట్లూ, మామిడి తోపులు రకరకాలపళ్ళ తోటలూ చూస్తానంటే వెళ్దామన్నాను. గాని మా చుట్టాల్ని సమయం వస్తే పుచ్చు వంకాయలు ఏరి పారేసినట్లు ఏరి పారేస్తారని తెలుస్తే నేను మిమ్మల్ని గడపదాట నిచ్చేదాన్ని కాదు.

జరీ అంచు పవిట చెంగుతో మీరెండు చేతులూ గట్టిగా బిగించి ఏ రోలుకో మంచం కోడుకో కట్టిపారెయ్యాలి!

అతను మా అన్నయ్య. వెనక బెజవాడోసారి వచ్చాడు. అప్పుడు వాళ్ళ స్నేహితులెవరికో పెళ్ళన్నాడు శుభలేఖ చూపించాడు. పెళ్ళికూతురి కని ప్రయిజు కొనిపించారు కూడా బజారు కెళ్ళి. అంతవరకూ సవ్యంగానే వుంది. ఆ రిక్షావాడికి ఫలానా సుబ్బారావు గారింటికని మీ రిచ్చిన అడ్రసు చెడ్డగంద్రగోళం తెచ్చి పెట్టింది.

ఎంతమంది సుబ్బారావుల్లేరు? ఎంతమంది సత్యనారాయణలు లేరు ఆంధ్రదేశంలో - ఈ మామిడిపళ్ళ సీజన్లో పెళ్ళిళ్లసీజను కలిసివస్తే అందరిళ్ళల్లోనూ పెళ్ళిళ్లే గదా!

ఈ రిక్షావాడు మీరు చెప్పిన అడ్రసుకు తీసు కెళ్లి ఇదేసుబ్బారావుగారిల్లు, గవర్నరుపేట సింహాల మేడదగ్గిర అని మా అన్నయ్యను దిగబెట్టాట్ట. అప్పటికి పెళ్లి తలంబ్రాలూ, చదివింపులూ దగ్గర వుందట. మీకు తెలుసుగా మా అన్నయ్య వట్టి కంగారు మనిషని-ఆ ప్రయిజూ, వెండి కప్పూ-సాసరూ చదివించే ఆయన దగ్గర వుంచి చందన తాంబూలాదులు అందుకుని ఇటూ అటూ చూస్తున్నాడట. ఇంతలో కాఫీ ఫలహారాలకు, అట్నుంచటే అర్జంటు అతిథులకు భోజనాల ఏర్పాటు జరిగే పందిట్లోకి లాక్కుపోయారట. మీకు తెలుసుగా మా అన్నయ్యకు "పేకాట" చిన్న వీక్నెసు అనీ. ఆ ఫలహారాలూ, విందులూ, అయాక పెళ్ళివారి విడిదిలో "పేకాట"కు కూర్చున్నాట్ట.

ఇంతలో పెళ్లి కొడుకూ - పెళ్ళి కూతురూ పాదాభివందనం చేయడానికి వచ్చారుట.

అప్పుడు మా అన్నయ్యకు ముచ్చెమటలు పోసేశాయి. గుడ్లు మీదకు వెళ్ళిపోయాయి. పేకాటలోంచి లేచి ముక్కలు పక్కన కూర్చున్న వాడి చేతిలో పెట్టి తువ్వాలుమీద డబ్బుల్నైనా ఏరుకోకుండా తెలిసిన కాకినాడ వంట బ్రాహ్మలని శరణుజొచ్చి, ఆ హోల్డాలు, సూటుకేసూ బైట పెట్టించుగుని - ఆ రాత్రి చీకట్లోతిరిగి కంటికి కనిపించకుండా వనములను దాటి వెన్నెల బయలుదాటి, విపినములుదాటి దుర్గమాద్రులను దాటి అన్నట్లు ప్రాణాలతో స్టేషనుకొచ్చి పడి రాజమండ్రి టిక్కెట్టుచ్చుగున్నాట్ట- ఆ వెండికప్పు సాసరూ పెళ్ళికూతురికి ప్రాప్తం. అది సరే లెండి గాని, సుబ్బారావుగారి ఇల్లంటే రిక్షావాడికి మీరు ఇలాగేనా అడ్రసు ఇవ్వడం?

అందుకనే మా అన్నయ్య వాళ్ళు మిమ్మల్ని జెంటిల్మాను, అనుకోవడంలేదు పై పెచ్చు మీరు ఆజోకును బ్రహ్మాండంగా పెళ్ళి పందిట్లో సర్వులకీ చెప్పడం మా అన్నయ్య "మిష్టర్ మార్క్"కి పుండుమీద కారంజల్లినట్లుగా వుండమంటే ఉండదూ

అందుకనే కోనసీమ పెళ్ళికి వెళ్తే మీ కెంత గౌరవం ఇవ్వాలో అంతా నాకూ ఇచ్చారు.

పెళ్ళి శుభలేఖ సరిగా చూడకుండా ఇంకెవరికీ అటువంటి ఉచిత సలహాలూ అడ్రసులూ ఇవ్వకండి. ఇవ్వనని ఒట్టేయండి!

## మరపురాని బాధకన్నా మధురమే లేదు!

మన జీవితంలో విషాదాన్ని సూచించే స్వగతాలే మధుర మైనవి. ఢిల్లీలో ఓసారి రేడియో వారు ఎందుకోగాని మిమ్మల్ని పిలిచారు. మీ స్నేహితులువచ్చి ఎంతో బలవంతం చేసి గుచ్చిగుచ్చి అడిగితే "తొడుక్కోడానికి మంచిచొక్కా లేదని మీరు రాలేనన్నారు". ఆముక్క మీరుచెబుతుంటే నేను కిటికీ తలుపు చెక్కకు తల బాదుకుని ఏడ్చాను.